క్లుప్తంగా

సత్తాచాటిన విద్యార్థులు

భద్రాచలంటౌన్: భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రథమ సెమిస్టర్ ఫలితాల్లో సత్తాచాటినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డి.భద్రయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. లైఫ్ సైన్స్ విభాగంలో బొర్రా అఖిల 8.50, రాజశేఖర్ దొర 4.05, పొట్ట అరుణ కుమారి 8.34, ఖాదర్ పాషా 7.79, త్రిపాఠి అంజలి 7.76, ఫిజికల్ సైన్స్ విభాగంలో విష్ణు వర్ధన్ 7.1, బీఏ విభాగంలో బర్ల రోహిణి 7.72, జాడి శిరీష 7.40, కొర్స కిరణ్ కుమార్ 7.44, బి.కామ్ విభాగంలో షేక్ యాసిన్ 7.59, చింతా రవి కుమార్ 7.51 పాయింట్లు సాధించి నట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

పూడికతీత పనులు

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం పంచాయతీలో డ్రెయినేజీ పూడికతీత పనులను గురువారం చేపట్టారు. లక్ష్మీనగరం గ్రామంలోని డ్రెయినేజీ అంతా నిండి పోయి చెత్తచెదారం, మట్టితో మూసుకుపోయింది. దీంతో నీళ్లు కదలక ఎక్కడివి అక్కడే నిలిచిపోతుండటంతో పంచాయతీ కార్యదర్శి అనూష జేసీబీతో పూడిక తీయించారు. గ్రామంలోని ప్రధాన రహదారి, రెడ్డిస్ వీధి, కుమ్మరిబజార్‌లలో పనులు కొనసాగాయి.

ముగిసిన వేసవి సైన్స్ సంబురాలు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని జ్యోతి హైస్కూల్‌లో జనవిజ్ఞాన వేదిక భద్రాద్రి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి సైన్స్ శిక్షణా శిబిరం గురువారంతో ముగిసింది. ఈ శిక్షణా శిబిరంలో మూడు రోజుల పాటు విద్యార్థులకు కిచెన్ సైన్స్, చెస్, తమసా, గణితం, మ్యాజిక్, ఫిజిక్స్ ప్రయోగాలు తదితర అంశాలపై రిసోర్స్ పర్సన్స్ సాయి నాగరాజు, పద్మ అవగాహన కల్పించారు. విద్యార్థులు సైతం ఎండను లెక్క చేయకుండా ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నారని రిసోర్స్ పర్సన్స్ తెలిపారు.

జలగం పర్యటన

దమ్మపేట: మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు మండల పరిధిలోని పలు గ్రామాలలో గురువారం రాత్రి సుడిగాలి పర్యటన చేశారు. దమ్మపేట, పెద్దగొల్లగూడెం గ్రామాలలో పర్యటించిన జలగం.. ఆయన వర్గీయులతో సమావేశమై, కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా జలగంను, అభిమానులు మర్యాదపూర్వకంగా శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో రావుల శ్రీను, చిన్నశెట్టి సత్యనారాయణ, జలగం వాసు, రామకృష్ణ పాల్గొన్నారు.

మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌లోని సాయిబాబా వారి మందిరంలో గురువారం భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. బాబావారి మందిరంలో ప్రతి గురువారం నిర్వహించే ప్రత్యేక పూజలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు. ఈ క్రమంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు, లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల మాజీ చైర్మన్ దివంగత మాగంటి సూర్యం జ్ఞాపకార్థం వారి కుమారులు భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి అభినందన

భద్రాచలంఅర్బన్: భద్రాచలం సిటీ స్టైల్ జిమ్‌కు చెందిన క్రీడాకారుడు గాలి రామ్మోహన్ రావు ఈనెల 11 నుంచి 15 వరకు చెన్నైలో జరిగిన జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో మాస్టర్–4 క్యాటగిరిలో 105 కేజీల విభాగంలో బెంచ్ ప్రెస్ 70 కేజీలు, స్క్వాట్ 70 కేజీలు, డెడ్ లిఫ్ట్ 90 కేజీలు మొత్తం కలిపి 230 కేజీల బరువు ఎత్తాడు. తద్వారా బంగారు పథకాన్ని కై వసం చేసుకున్నాడు. గెలుపొందిన క్రీడాకారున్ని, కోచ్ జీవి రామిరెడ్డిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ తన కార్యాలయంలో ప్రత్యేకించి అభినందించారు. 72 సంవత్సరాల వయస్సులో కూడా ఈ రకంగా బరువులు ఎత్తి సత్తా చాటడంపై హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా నాభిశిల ప్రతిష్ఠ

గుండాల: మండలంలోని కొడవటంచ గ్రామంలో నాభిశిల, ముత్యాలమ్మ పోతురాజుల విగ్రహ ప్రతిష్ఠను గురువారం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ వేల్పుల వీరస్వామి సిద్ధాంతి నేతృత్వంలో పూజా కార్యక్రమం నిర్వహించారు. గత మూడు రోజులుగా ఈ ప్రతిష్ఠ వేడుకలను ప్రత్యేక పూజలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. గురువారం ఉదయం ముత్యాలమ్మ బొడ్రాయి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఊరేగింపుగా బోనాలు తలలపై పెట్టుకుని ఆడపడుచులంత ర్యాలీగా బయలుదేరి గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పినపాక మాజీ ఎమ్మెల్యే పాయ వెంకటేశ్వర్లు హాజరయ్యారు.

బాధితులకు వితరణ

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన మురికిపూడి వీర్రాజు కుటుంబానికి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణ మూర్తి ఆదేశంతో మండల ప్రధానకార్యదర్శి కణితి రాముడు బియ్యం, వంట పాత్రలు, దుప్పట్లు వితరణగా గురువారం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జానీ పాషా, జుంజూరి జయసింహా, కెల్లా శేకర్, జిలకర గంగరాజు, జంగిటి రాము, కాకర్ల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నిఘా నేత్రంతో నేరాల అదుపు

- దర్యాప్తులో కీలకంగా సీసీ ఫుటేజీ
- పల్లెల్లోనూ ఏర్పాటుకు పోలీసుల ప్రోత్సాహం
- ముమ్మరంగా కొనసాగుతున్న అవగాహన కార్యక్రమాలు


సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న మాజీ ఏఎస్పీ రోహిత్‌రాజ్ (ఫైల్)

భద్రాచలంఅర్బన్: ప్రస్తుతం రోజురోజుకూ సీసీ కెమెరాల ప్రాధాన్యత పెరుగుతోంది. గ్రామాల్లో నేరాల నియంత్రణ, ప్రజలకు భద్రత కల్పించేందుకు సీసీ కెమెరాలు ప్రధాన భూమిక పోషిస్తున్నాయి. ఇవి ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గుతుండడంతో గ్రామీణ, పట్టణ ప్రజలు తమ నివాస ప్రాంతాల్లో సీసీ కెమెరాలు బిగించుకునేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు పోలీస్ అధికారులు గ్రామాల్లో పర్యటించి ఏర్పాటుపై అవగాహన కల్పిస్తున్నారు. అంతే కాకుండా నేర పరిశోధన వేగంగా పూర్తి చేసేందుకు పోలీసులకు సీసీ కెమెరాలు ఉపయోగపడుతున్నాయి. గ్రామాల్లో అవసరాలకు అనుగుణంగా ప్రధాన వీధుల సంఖ్యను బట్టి ఏర్పాటు చేసుకునేలా పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. కేసుల విచారణలో సీసీలు ఎంతగానో ఉపయోగపడుతున్నట్లు పోలీసులు పేర్కొంటున్నారు.

పట్టణ ప్రజలకు అవగాహన..

ప్రస్తుతం తెలంగాణ పోలీస్‌లు ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను అమలు చేస్తున్నారు. గతంలో మాదిరిగా కాకుండా ప్రతి కేసు విషయంలో ప్రజలకు సత్వర న్యాయం అందించేలా, వారికి రక్షణ కల్పించేలా కృషి చేస్తున్నారు. అందులో భాగంగా భద్రాచలం పట్టణంలో పోలీసు అధికారులు నిత్యం పర్యటిస్తూ సీసీ కెమెరాల ఆవశ్యకతను వివరిస్తున్నారు. గ్రామాన్ని బట్టి ఎన్ని కెమెరాలు అవసరమవుతాయి, కంట్రోల్ యూనిట్ ఎక్కడ ఏర్పాటు చేయాలి అనే అంశాలపై వారికి వివరిస్తున్నారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమంటూ కేసుల ఛేదనలో వాటి ప్రాముఖ్యాన్ని ప్రజలకు లోతుగా వివరించారు. దీంతో భద్రాచలం టౌన్ పరిధిలో మొత్తం 110 సీసీ కెమెరాలు, కంట్రోల్ యూనిట్లు ఏర్పాటు చేసి వాటిని పోలీస్ స్టేషన్‌లోని కంట్రోల్ యూనిటు లింక్ చేశారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఇటీవల పలు కేసుల్లో సీసీ కెమెరాల సాయంతో నిందితులను పట్టుకు న్నారు. ముఖ్యంగా దొంగతనాలు, ర్యాగింగ్ నివారణలో ఉత్తమంగా పనిచేస్తున్నాయని పోలీసులు చెబుతున్నారు. 2021 లో ఆగస్టు 24 న భద్రాచలం పట్టణంలో సుమారు రూ.26 లక్షల వ్యాయంతో గత ఎస్పీ సునీల్ దత్, భద్రాచలం ఏఎస్పీ డాక్టర్ వినీత్ అప్పట్లోనే 89 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ప్రారంభించారు. అనంతరం భద్రాచలం ఏఎస్పీ గా విధులు నిర్వహిస్తున్న రోహిత్‌రాజ్ మరో 10 సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. క్రమ క్రమంగా పెరుగుతూ వీటి సంఖ్య ప్రస్తుతం 110 కి చేరింది. ఈ కేంద్రాన్ని ప్రారంభించినప్పటి నుంచి వివిధ రకాలు కేసులకు సంబంధించి దాదాపు 700 కేసులను పోలీసులు ఛేదించినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

పరిశోధన, నియంత్రణలో కీలకం



నేర పరిశోధన, నియంత్రణలో సీసీ కెమెరాల ప్రాధాన్యం పెరిగింది. దొంగలు, దోషులను పట్టుకోవడంలో మార్గం సుగమం అవుతోంది. ప్రస్తుతం పల్లెల్లోనూ సీసీ కెమెరాలు పెడుతున్నారు. గతంలో దొంగతనాల పరిశోధన కొంత ఇబ్బందికరంగా ఉండేది. ఇప్పుడు సీసీలు ఉన్న ప్రాంతాల్లో చోరీలు తగ్గుముఖం పట్టాయి. సీసీ ఫుటేజీల ద్వారా దోషులను గుర్తించి, గంటల వ్యవధిలోనే పట్టుకోగలుగుతున్నాం. జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

– పరితోష్ పంకజ్, ఏఎస్పీ, భద్రాచలం

మానవ తప్పిదాలతోనే ఉష్ణోగ్రతలు


సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ జీఎం నాగేశ్వరరావు

మణుగూరుటౌన్: మానవ తప్పిదాలతోనే అధిక ఉష్ణోగ్రతలు వస్తున్నాయని మణుగూరు ఏరియా ఇన్‌చార్జ్ జనరల్ మేనేజర్ జి.నాగేశ్వరరావు అన్నారు. గురువారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన పర్యావరణ పరిక్షణపై అవగాహణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వచ్చేనెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పర్యావరణంపై ఇటువంటి అవగాహణ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం భరించలేని అధిక ఉష్ణోగ్రతలతో వడగాలుతో రాష్ట్ర ప్రజలతోపాటు పశుపక్షాదులు సైతం అల్లాడిపోతున్నాయని తెలిపారు. అందుకు కారణం వాతావరణంలో వచ్చిన అనూహ్య మార్పులేనని, ఆ మార్పులకు మానవ తప్పిదాలే కారణమని అన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే మానవ మనుగడకు మరింత ప్రమాదం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని, ఇంకుడు గుంటల ద్వారా నీరు నిలువ చేసుకోవాలన్నారు. ఫ్రీజ్‌లు కూలర్స్ తక్కువగా వినియోగిస్తూ విద్యుత్‌శక్తిని ఆదాచేయాలన్నారు. ఉద్యోగుల చేత పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో ఏరియా ఎస్వోటూ జీఎం డి.లలిత్‌కుమార్, డీజీఎం పర్సనల్ ఎస్.రమేష్, డీజీఎం పర్చేజ్ శ్రీనివాసమూర్తి, డీజీఎం ఫైనాన్స్ అనురాధ, పర్యావరణ అధికారి జె.శ్రీనివాస్, డీవైఎస్ఈ ఐఈడీ శ్రీనివాస్, డీవై ఫైనాన్స్ మేనేజర్ పి.రమేష్, జీఎం పీఏ రాంబాబు, మినిస్ట్రీయల్ స్టాఫ్ పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం..


సమావేశంలో మాట్లాడుతున్న భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య

అన్నపురెడ్డిపల్లి: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి, అధికారంలోకి వస్తుందని భద్రాచలం ఎమ్మెల్యే, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్య ధీమా వ్యక్తం చేశారు. గురువారం అన్నపురెడ్డిపల్లిలోని అంకమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేసిన లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ మిషన్ (ఎల్‌డీఎం) సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్ణాటక ఎన్నికల ఫలితాలే తెలంగాణ రాష్ట్రంలో పునరావృతం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ములకలపల్లి జెడ్పీటీసీ, టీపీసీసీ మెంబర్ సున్నం నాగమణి, ఎల్‌డీఎం నియోజవర్గ ఇన్‌చార్జ్ ఏనుగుల అర్జునరావు, మోతు కూరి ధర్మారావు, వనమా గాంధీ, మద్దిశెట్టి సత్యప్రసాద్, దోసపాటి రాంబాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మెచ్చా విస్తృత పర్యటన


రోడ్డు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే నాగేశ్వరరావు

అన్నపురెడ్డిపల్లి: మండలంలో స్థానిక ఎమ్మెల్యే మెచ్చానాగేశ్వరరావు గురువారం విస్తతంగా పర్యటించారు. రంగాపురం, భీమునిగూడెం, బురుగూడెం, శాంతినగర్, ఎర్రగుంట, గుంపెన హెచ్‌కాలని, కట్టుగూడెం, అబ్బుగూడెం, మర్రిగూడెం గ్రామాల్లో రూ.కోటి 95 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. పర్యటనలో భాగంగా గ్రామాలలో ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గుంపెన హెచ్ కాలనీలో ప్రజలు తాగు నీటికి బోరు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి, ప్రజల సంక్షేమమే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ భారత లాలమ్మ, ఎంపీపీ సున్నం లలిత, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు, గుంపెన సొసైటీ చైర్మన్ బోయినపల్లి సుధాకర్, వైస్ ఎంపీపీ మామిళ్లపల్లి రామారావు, ఎంపీడీఓ అన్నపూర్ణ, ఎంపీఓ షబ్నా, ఎంపీటీసీలు, సర్పంచులు,పంచాయతీ కార్యదర్శులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోత

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ మైథిలి గురువారం ఒక ప్రకటన తెలిపారు. రెవెన్యూ కాలనీలోని 11కేవీ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా అశోక్ నగర్ కొత్త కాలనీ, అశోక్ నగర్ కాలనీ, రెవెన్యూ కాలనీ, భూపతిరావు కాలనీ, బ్రిడ్జి రోడ్డు, అయ్యప్ప కాలనీ, పీవీసీ రోడ్డులోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

మెమెంటోలు అందజేత

కరకగూడెం: ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపట్టిన సీఎం కప్ క్రీడా పోటీలు గురువారంతో ముగిశాయి. ఈ మేరకు మండలంలోని తాటిగూడెం గ్రామంలోని క్రీడా ప్రాంగణంలో ఎంపీపీ రేగా కాళిక విజేతలకు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శంకర్, ఎంపీఓ శ్యాంసుందర్ రెడ్డి, పీఈడీ కొమరం వెంకటరమణ, పీటీ వట్టం సంపత్, సీపీఎం మండల కార్యదర్శి కొమరం కాంతారావు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోండి

అశ్వాపురం: ప్రభుత్వం నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ముత్తినేని సుజాత అన్నారు. మండల పరిధిలోని మిట్టగూడెం జెడ్పీ స్కూల్‌లో కంటి వెలుగు శిబిరాన్ని గురువారం ఎంపీపీ ముత్తినేని సుజాత సందర్శించారు.డాక్టర్ నరహరి, సంకీర్తన, ఎంపీడీఓ వరప్రసాద్, స్వర్ణలత, సర్పంచ్ పర్శిక రాజమ్మ, కార్యదర్శి ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

చండ్రుగొండ: ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ భూక్యా సునిత కోరారు. మండలంలోని మంగయ్యబంజర్ గ్రామంలో గురువారం కంటివైద్య శిబిరాన్ని ప్రారంభించారు. భోజ్యానాయక్, డాక్టర్లు కనకం తనుజా, రఘునంద సాయి బాబు, సెక్రటరీ ప్రసాద్ పాల్గొన్నారు.

దమ్మపేట: మండల పరిధిలోని పెద్దగొల్లగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని గురువారం జెడ్పీటీసీ సభ్యులు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ సోయం ప్రసాద్, వైస్ ఎంపీపీ దారా మల్లిఖార్జునరావు, సర్పంచ్ నాగమణి, కొయ్యల అచ్యుతరావు, జలగం వాసు తదితరులు పాల్గొన్నారు.

బ్యాగులు అందజేయాలి

అశ్వాపురం: మండల పరిధిలోని బీజీకొత్తూరు ధాన్యం కొనుగోలు కేంద్రంలో గన్నీ బ్యాగులు ఉన్నా తమకు ఇవ్వడం లేదని రైతులు గురువారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. గన్నీ బ్యాగులు ఉన్నప్పటికీ నెల్లిపాక సహకార సంఘం నిర్వాహకులు నిర్లక్ష్యంగా గన్నీ బ్యాగులు ఇవ్వడం లేదని తెలిపారు. నిర్వాహకులు స్పందించకపోతే ఆందోళన చేపడతామని రైతులు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

మణుగూరురూరల్: పట్టణంలోని తెలంగాణా చౌరస్తాలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. మణుగూరుకు చెందిన బత్తుల సాంబశివరావు–సీతామహలక్ష్మి దంపతులు ద్విచక్ర వాహనంపై అశ్వాపురం వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో జెన్‌కోకు సంబంధించిన బొలెరో వాహనం వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో సాంబశివరావు దంపతులకు గాయాలు కాగా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి



ధర్నా నిర్వహిస్తున్న కాలనీ వాసులు

మణుగూరురూరల్: మండలంలోని కూనవరం రైల్వేగేట్ నుంచి బొంబాయికాలనీ వరకు అధ్వానంగా ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం కాలనీవాసులు మహాత్మాగాంధీ విగ్రహం వద్ద కాలనీవాసులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. రోడ్డును బాగు చేయాలని సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు అనేకసార్లు విన్నవించామని, అయినా పట్టించుకోవడం లేదన్నారు. గుంతలమయమైన రోడ్డుతో కాలనీవాసులు, ఆటోవాలాలు, ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డుకు మరమ్మత్తులు చేయించాలని డిమాండ్ చేశారు. అలాగే పివికాలనీ అంతర్గత రోడ్లకు కూడా సింగరేణి యాజమాన్యం మరమ్మత్తులు చేయించాలన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు, కాలనీవెల్ఫేర్ కమిటీ సభ్యుడు కె.వెంకటేశ్వర్లు, ఎస్.కుమారస్వామి, గట్టయ్య, లక్ష్మీనారాయణ, అంజయ్య, జానకిప్రసాద్, శ్రీనివాస్, యాకయ్య, యూనస్ తదితరులు పాల్గొన్నారు.

సంఘటితంగా ముందుకు సాగాలి

మణుగూరురూరల్: మున్నూరుకాపులంతా సంఘటితంగా ముందుకు సాగాలని మణుగూరు మండల మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు వన్నం కృష్ణమోహన్ అన్నారు. సింగరేణి వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం బుధవారం రాత్రి పీవీకాలనీ రామాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి గాండ్ల సురేష్‌లు మాట్లాడుతూ.. మున్నూరుకాపు కులస్తులంతా ఐక్యంగా ఉంటూ రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలన్నారు. అనంతరం మున్నూరుకాపు సింగరేణి వెల్ఫేర్ అసోసియేషన్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఇందూరి శంకర్, ప్రధాన కార్యదర్శిగా రాంనర్సయ్య, కోశాధికారిగా రాంనర్సయ్యలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల మున్నూరుకాపు సంఘం నాయకులు పసునూరి ఉప్పలయ్య, కర్ల వెంకన్న, నియోజకవర్గ యువజన నాయకుడు కాట్రగడ్డ సురేందర్, ఎస్.చరణ్, మున్నూరుకాపు సింగరేణి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆదిశంకర్, అశోక్, గోపిశెట్టి శివయ్య, శ్రీను, ఆర్.నాగేశ్వరరావు, సేపూరి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం


స్వామి వారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీభ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి వారి ఆలయంలో మాస శివరాత్రిని పురస్కరించుకుని గురువారం శివపార్వతులు కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. ఉదయం నుంచి ఆలయంలో స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అభిషేకాలు, గోత్రనామ అర్చన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారి కల్యాణాన్ని ఆలయ అర్చకులు సత్యనారాయణశర్మ, సాయి శాస్త్రోక్తంగా జరిపించారు. స్వామి వారి కల్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

మౌలిక వసతులు కల్పించాలి

బూర్గంపాడు: మారుమూల గిరిజన గ్రామాల్లో మౌలికవసతులు కల్పించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దిశెట్టి సామేలు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని మారుమూల గ్రామమైన చింతకుంటలో ఆర్‌పీఐ బృందం పర్యటించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీరాంపురం నుంచి చింతకుంట గ్రామానికి రహదారి నిర్మించాలని, తాగునీటి వసతులు కల్పించాలన్నారు. ఈ క్రమంలో ఉపాధిహామీ కూలీలను కలసి వారితో మాట్లాడారు. మండుటెండల్లో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలకు సరైన వసతులు లేవన్నారు. వీరి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు కేసుపాక నర్సింహారావు, ఏబీఆర్ మూర్తి, ఇస్రం శ్రీనివాస్, గారపాటి సుధాకర్, పలగాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకపత్రం అందజేత

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో పని చేస్తూ మెడికల్ అన్‌ఫిట్ అయిన అనపర్తి సాయిలు కుమారుడు భాస్కర్‌కు గురువారం జీఎం కార్యాలయ ప్రాంగణంలో ఏరియా ఎస్వోటు జీఎం డి.లలిత్‌కుమార్ కారుణ్యనియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏరియా డీజీఎం(పర్సనల్) ఎస్.రమేష్, టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌రావు, సీనియర్ పర్సనల్ అధికారులు సింగు శ్రీనివాస్, వి.రామేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ శ్వేత పాల్గొన్నారు.

చట్టబద్ధత కల్పించాలి

భద్రాచలంటౌన్: కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కోఆర్డినేటర్ దేపంగి రమణయ్య అన్నారు. పట్టణంలోని టీఎస్జీవోస్ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.ఎస్సీ వర్గీకరణ సాధన, చట్టసభల్లో అడుగు పెట్టడానికి ఎమ్మార్పీస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం ఈ నెల 23న పాల్వంచలో జరుగుతుందని తెలిపారు. కార్యక్రమయంలో అలవాల రాజా పెరియార్, వెంకటేశ్వర్లు, తిరుపతి, కొండయ్య, వెంకటేశ్వర్లు, సతీష్, లత, సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం ఏర్పాటు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం జగదీష్ కాలనీలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో తలసేమియా, సికెల్ సెల్ అనీమియాతో బాధపడుతున్న చిన్న పిల్లల కోసం సంకల్ప ఫౌండేషన్, ఖమ్మం వారి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన పిల్లల వైద్యుడు డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడారు. రక్తదానం చేయడం అంటే ప్రాణదానం చేయడమేనని అన్నారు. ఈ శిబిరంలో సుమారు 20 మంది రక్తదానం చేశారు. వారికి ఫౌండేషన్ తరుపున ప్రశంస పత్రాలు అందజేశారు. మండల విద్యాశాఖాధికారి సమ్మయ్య, లక్ష్మణ్, వెంకటేశ్వర్లు, గుజ్జుల శ్రీకాంత్ రెడ్డి, సాయికృష్ణ, రవిచంద్ర పాల్గొన్నారు.

ఆటోవాలాలు నమ్మకంగా ఉండాలి


ఆటోల పత్రాలను పరిశీలిస్తున్న పోలీసులు

చండ్రుగొండ: ప్రయాణికుల్లో నమ్మకం, ధైర్యం ఉండేలా ఆటోవాలాలు వ్యవహరించాలని ఎస్సై గొల్లపల్లి విజయలక్ష్మి సూచించారు. మండలంలోని ఆటో డ్రైవర్లు, యజమానులతో గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఆటోవాలాలు ప్రయాణికుల పట్ల గౌరవ మర్యాదలతో ప్రవర్తించాలన్నారు. ఆటో ఎక్కిన తరువాత ప్రయాణికులు వారి గమ్యస్థానం చేరే వరకు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఆటోలకు సంబంధించిన ఆర్‌సీ, ఇన్సురెన్స్, ఫిట్‌నెస్, పొల్యూషన్, డ్రైవర్ల లైసెన్స్‌లను ఆమె పరిశీలించారు. విధిగా డ్రైవర్లు డ్రస్‌కోడ్ పాటించాలన్నారు. అనుమానిత వ్యక్తులు కన్పించినప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆటోయూనియన్ల నాయకులు, డ్రైవర్లు, ఓనర్లు పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలే నివాళి


సైదన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

భద్రాచలంఅర్బన్: ప్రజా పోరాటాల్లో ప్రతీ కార్యకర్త భాగస్వామ్యం కావటమే సైదన్నకు తామిచ్చే ఘన నివాళి అని, ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. ప్రజా కళాకారుడు, సీపీఎం మాజీ పట్టణ కమిటీ సభ్యుడు తోటకూర సైదయ్య 20వ వర్ధంతి సభ పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన అశోక్ నగర్ కొత్త కాలనీలో గురువారం జరిగింది. ముందుగా పార్టీ పతాకాన్ని మచ్చ వెంకటేశ్వర్లు ఆవిష్కరించి సైదయ్య స్తూపానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..అశోక్ నగర్ కొత్త కాలనీలో పార్టీ నిర్మాణంలో సైదయ్య కీలక పాత్ర పోషించారని అన్నారు. కింది స్థాయి వర్గం నుంచి వచ్చి పార్టీలో పట్టణ కమిటీ సభ్యుడిగా ఎదిగారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యుడు పి.సంతోష్ కుమార్, పట్టణ కమిటీ సభ్యులు ఎన్.నాగరాజు, భూపేంద్ర, డీవైఎఫ్ఎస్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ప్రేమ్ కుమార్, సతీష్, శాఖ కార్యదర్శులు సుశీల, జయ, సిఐటియు నాయకులు చంద్రలీల, పార్టీ సభ్యులు ఝాన్సీ, హైమావతి, ఆదిలక్ష్మి, రాజేంద్రప్రసాద్, మునీశ్వరరావు, సైదయ్య కుమారుడు సందీప్, ప్రదీప్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'మెచ్చా లీగ్' ప్రారంభం


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న సీఐ బాలకృష్ణ

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని గాండ్లగూడెం గ్రామంలో గురువారం మెచ్చా లీగ్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ప్రారంభమైయ్యాయి. గ్రామస్తుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెచ్చా లీగ్ క్రికెట్ పోటీలను స్థానిక సీఐ బాలకృష్ణ చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడా పోటీలతో మానసిక ఉల్లాసం పెరుగుతుందని, ప్రశాంత వాతావరణంలో పోటీలు సాగాలని అన్నారు. అలాగే ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ.. ఈ పోటీల్లో గెలుపొందే ప్రథమ జట్టుకు స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు సహకారంతో రూ.40,116 అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.చిలకమ్మ, సొసైటీ డైరెక్టర్ బి.ప్రసాద్, బీఆర్ఎస్ నాయకులు మందపాటి మోహన్‌రెడ్డి, చందా లక్ష్మీనర్సయ్య, వెంకన్నబాబు, మాలోతు అలీబాబు, చంద్రకళ, ఫిరోజ్ నాయక్ పాల్గొన్నారు.